క్లుప్తంగా

40 మందికి కంటి పరీక్షలు



నేలటూరులో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: నేలటూరులో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 40 మందికి కంటి పరీక్షలను చేశారు. పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 25 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఐదుగురుకి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కుక్కల వీరన్న సందర్శించారు. శిబిరంలో ఆరోగ్య కార్యకర్త సునీత, ఆశ కార్యకర్తలు స్వప్న, లలిత సేవలందించారు.

11న బార్ కౌన్సిల్ ఎన్నికలు

రామచంద్రపురం: వచ్చే నెల 11వ తేదీన రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహిస్తున్నట్టు ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లిడి హరినాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించి, 2వ తేదీన స్క్రూట్నీ చేసి, అనంతరం 3 నుంచి 5వ తేదీ వరకూ నామినేషన్ల విత్‌డ్రా ఉంటుందన్నారు. అనంతరం 11వ తేదీన ఎన్నిక జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి శ్రీరాముని బ్రహ్మోత్సవాలు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద సీతారామక్షేత్రంలో స్వామివారి 6వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. అందుకు అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ పూర్తి చేసింది. చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం శ్రీరామ దీక్షలతో వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు తెలిపారు. బ్రహోత్సవాల్లో వేదపండితులు గొడవర్తి అనంతవెంకట దీక్షిత్‌స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు మరంగంటి వరదాచార్యస్వామి పర్యవేక్షణలో ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వకూ స్వామివారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని తెలిపారు. స్వామివారి మాలధారణలో ఉండే భక్తులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తామని ఆయన తెలిపారు.

150 మందికి వైద్య పరీక్షలు



కార్మికులకు మందులు అందజేస్తున్న జీఎం కీర్తికృష్ణ

మండపేట: కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారపూడి రైల్వేగూడ్స్ షెడ్డు వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి కార్మికులకు పరీక్షలు చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంస్థ జోనల్ మేనేజర్ కీర్తికృష్ణ ప్రారంభించారు. రాజమహేంద్రవరంలోని మీనాక్షి ఆస్పత్రి వైద్యులు అజయ్ కుమార్ కార్మికులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజీఎస్ఆర్ అక్బర్‌ఆలీ, జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు జాప్యం.. ప్రయాణికుల ఇక్కట్లు

మండపేట: మండపేట-ద్వారపూడి రోడ్డు పనుల్లో జరుగుతున్న జాప్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోడ్డు పనులు ప్రారంభించి ఎనిమిది నెలలైనా ఇంకా పూర్తి చేయలేపోయారన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నవమి వేడుకలకు రాట ముహూర్తం



రాయవరంలో రాట పూజలు చేస్తున్న దృశ్యం

రాయవరం: స్థానిక శెట్టిబలిజ రామాలయం వద్ద సోమవారం శ్రీరామనవమిని పురస్కరించుకుని రాట ముహూర్తం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కాల్దారి సీతారామ శర్మ అర్చకత్వంలో ఉప సర్పంచ్ బొడ్డు శ్రీనివాసు తదితరులు పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణంలో భాగంగా రాట ముహూర్తం పూజలు చేశామని, కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప సర్పంచ్ శ్రీను తెలిపారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం పెద్దలు కేతా ఏడుకొండలు, కుడుపూడి సూర్యనారాయణ, టేకుమూడి గోవిందు, కుక్కల కొండ, కాలా శ్రీను, టేకుమూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ఉపకారం

- ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల అర్హత
- క్లస్టర్ పరిధిలో 51 మంది ఎంపిక



రత్నంపేట హైస్కూల్

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పేరిట పరీక్ష నిర్వహిస్తోంది. 8వ తరగతి విద్యార్థులు ఈ పరీక్షలో అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకూ నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేల వంతున ఉపకార వేతనం లభిస్తుంది. పరీక్షను ఈ ఏడాది ఫిబ్రవరి 5న నిర్వహించగా, ఈ నెల 24న ఫలితాలు విడుదలయ్యాయి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలో 22 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హత సాధించారు. రామచంద్రపురం పట్టణంలోని రత్నంపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు అత్యధికంగా 10 మంది అర్హత సాధించగా, మండపేట ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు, ఎస్‌జీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు నలుగురు, రాయవరం మండలం మాచవరం, మండపేట మండలం తాపేశ్వరం, వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు వంతున అర్హత సాధించారు. రామచంద్రపురం ఎస్ఎల్‌బీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, రామచంద్రపురం ఎస్ఆర్‌జీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఎస్‌టీపీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాల , జెడ్పీహెచ్ఎస్, జి.వార్డు, జెడ్పీహెచ్ఎస్ హసన్‌బాద, రాయవరం మండలంలోని జెడ్పీహెచ్ఎస్, పసలపూడి, వెదురుపాక, కె.గంగవరం మండలం దంగేరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు ఇద్దరు చొప్పున అర్హత సాధించారు. మిగిలిన పాఠశాలల నుంచి ఒక్కొక్కరు వంతున అర్హత పొందారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రవేశ పరీక్షకు తర్ఫీదునివ్వడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు అర్హత సాధించడానికి అవకాశం ఏర్పడింది. ఈ ప్రవేశ పరీక్షలో పాల్గొనడం ద్వారా విద్యార్థులందరూ అర్హత సాధించనప్పటికీ ప్రవేశ పరీక్షను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన ఏర్పడిందని చెప్పవచ్చు.

మండలం	ఎంపికైన విద్యార్థులు
రామచంద్రపురం	22
మండపేట	18
రాయవరం	08
కె.గంగవరం	03

ఆన్‌లైన్‌లో వివరాలు

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి విడుదలైన ప్రొవిజనల్ జాబితాలో పేర్లున్న వారందరికీ కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలను అందజేయనుంది. ప్రాథమికంగా ఎంపికైన విద్యార్థులందరూ వారి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలి. ఎంపికైన వారు నాలుగేళ్లు విధిగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే చదవాల్సి ఉంటుంది.

నమూనా పరీక్షలు ఉపకరించాయి

ఆర్థికంగా బలం..



పరీక్షకు దరఖాస్తు చేసినప్పటి నుంచి పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తర్ఫీదునిచ్చారు. మెటీరియల్‌ను కూడా ఇవ్వడంతో కష్టపడి చదివాను. దానికి తగ్గ ఫలితం దక్కింది. 124 మార్కులు సాధించాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే సాధ్యమైంది. తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా ఉన్నత చదువులు చదివేందుకు ఉపయోగపడుతుంది.

-పరంశెట్టి దీపక్ సంతోష్, మున్సిపల్ హైస్కూల్, రత్నంపేట, రామచంద్రపురం

కష్టానికి తగ్గ ఫలితం



విద్యార్థులు పడిన కష్టానికి ఫలితం లభించింది. ఉపాధ్యాయులు కూడా ఎన్ఎంఎంఎస్ నోటిఫికేషన్‌కు ముందు నుంచీ ప్రిపేర్ అయ్యారు. మండలంలో పలు పాఠశాలల ఉపాధ్యాయుల అంకితభావానికి ఈ ఫలితాలే నిదర్శనం. విద్యార్థులకు అండగా ఉండి ముందుకు నడిపారు. ఈ ఏడాది 22 మంది ప్రవేశ పరీక్షలో అర్హత పొంది జిల్లాకు ఆదర్శంగా నిలిచారు.

- మానుపూడి శ్రీనివాస్, ఎంఈవో, రామచంద్రపురం

గత నాలుగేళ్ల మాదిరిగా..



మండలంలోని ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఫలితాలు వచ్చాయి. ఏటా ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. 2018లో 12, 2019లో 14, 2020లో 15, 2021లో 16 మంది అర్హత సాధించగా, గత నాలుగేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా మండలంలో 18 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలు ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉంది.

- నాయుడు రామచంద్రరావు, ఎంఈవో, మండపేట

ఆత్మ విశ్వాసం



పరీక్షకు దరఖాస్తు చేసినప్పుడు ఎలా రాస్తానో అని టెన్షన్ ఫీలయ్యాను. హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో కష్టపడి చదివాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చుననే ఆత్మ విశ్వాసం పెరిగింది. ఈ ఉపకార వేతనాన్ని చదువుకు వినియోగించుకుంటా. పాఠశాలలోని లైబ్రరీ పుస్తకాలు కూడా ఉపయోగపడ్డాయి. 180 మార్కులకు గాను 122 మార్కులు సాధించాను.

- ఒగ్గు కుశ్వంత్‌సాయి, జెడ్పీహెచ్ఎస్, మాచవరం, రాయవరం మండలం

ఆశీల వసూలుకు వేలం ఖరారు

కాజులూరు: గొల్లపాలెంలో వారపు సంతలు, డైలీ మార్కెట్లలో ఆశీల వసూలకు సోమవారం వేలం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన వేలం పాటను పంచాయతీరాజ్ అధికారులు రెండు విభాగాలుగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యంటపల్లి అర్జునరావు వారపు సంతలు రూ1.90 లక్షల హెచ్చు ధరకు పాట దక్కించుకోగా, డైలీ మార్కెట్లలో ఆశీల వసూలుకు రూ.3.41లక్షలకు హెచ్చు ధరకు పాట దక్కించుకున్నారు. గత ఏడాది వారపు సంతలు రూ.లక్షకు, డైలీ మార్కెట్ రూ.1,99,700కి పాట వెళ్లిందని, ఈ ఏడాది పాట రెట్టిపయ్యిందని కార్యదర్శి వేణుగోపాలరావు తెలిపారు. గ్రామసర్పంచ్ పి.ప్రసన్నమౌనిక, ఉపసర్పంచ్ భువనేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు



కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో సోమవారం సాయంత్రం ఆమె వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. కొత్తగా నియమించిన గృహసారథులను స్థానికులకు పరిచయం చేశారు. స్థానికులను సమస్యలడిగి తెలుసుకుని పరిష్కారానికి మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మీడియాతో మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, సచివాలయ కన్వీనర్లు గునిపే భూషణం, పేరూరి మాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వడ్లమూరులో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



వడ్లమూరులో మహిళలకు చెక్కునమూనాను అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వడ్లమూరులో సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ అధ్యక్షతన సోమవారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మంజూరైన ఆర్థిక లబ్ధి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, టేకి సత్యమంజు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలను మాయమాటలతో మభ్యపెట్టిందన్నారు. నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రుణమాఫీని క్రమం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం, అవినీతి లేకుండా ప్రభుత్వ లబ్ధిని నేరుగా మహిళా సంఘాల ఖాతాలకు జమ చేసిన ఘనత సీఎం జగన్‌కే చెల్లుతుందన్నారు. మండలంలో 1,504 సంఘాలకు చెందిన 14,176 మంది సభ్యులకు రూ.11.94 కోట్లు జమయ్యిందన్నారు. అచ్యుతాపురంలో 23 సంఘాల్లోని 235 మందికి, రూ.17,64,196, వడ్లమూరులో 33 సంఘాల్లోని 330 మందికి రూ.31,43,256, కాలేరులో 52 సంఘాల్లోని 520 మందికి రూ.31,23,067 మొత్తం మూడు గ్రామాల్లోని 108 సంఘాల్లోని 1,085 మంది సభ్యులకు రూ.80,30,519 మంజూరైందన్నారు. లబ్ధి పొందిన మహిళలు మాట్లాడుతూ తమ సంఘాల ఆర్థిక ప్రగతికి పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాలేరు వైస్ సర్పంచ్ పలివెల పద్మమణి, పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏలేటి గంగరాజు, చుండ్రు అమ్మన్న, రెడ్డి రుద్రమూర్తి, నక్కా సింహాచలం, సిరిపురపు శ్రీనివాస్, మండపేట ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సర్కారు లక్ష్యం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- శీలలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం



శీలలంకలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని శీలలంకలో మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీపీ మాత భారతి తదితరులు సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణకుమార్తిల ఆధ్వర్యంలో వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా శీలలంకలో మంత్రి వేణు పర్యటించగా గ్రామ శివారు ఒంటితాడిలో మంత్రి వేణు తనయుడు నరేన్ ఇంటింటా పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. పార్టీ మండల బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ పూజలు

గొల్లపాలెం పాపాయమ్మపేటలో గౌడా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రామాలయంలో జరుగుతున్న సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మంత్రి వేణు తనయుడు నరేన్, ఆర్ఎంసీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా బోధించాలి

- మంత్రి చెల్లుబోయిన వేణు
- ఆదర్శ ప్రాథమిక పాఠశాల సందర్శనం



పాణింగపల్లిలో విద్యార్థులతో అక్షరాలు రాయిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యపై మరింత ఆసక్తిని పెంచేలా బోధించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ సూచించారు. పాణింగపల్లిలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. తొలుత నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలలో జరిగిన అభివృద్ధిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని అమ్మఒడి పథకం ద్వారా ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిందన్నారు. అనంతరం చిన్నారులతో పలకపై అక్షరాలు రాయించి తప్పులను సరిదిద్ది ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. జెడ్పీటీసీ ఓబులనేని వరలక్ష్మి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పండు గోవిందరాజు, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ చీకట్ల సునీత, ఉప సర్పంచ్ మదుబాల, ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ పిల్లి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు అచ్యుతరామయ్య, పెద్దలు గోపాలం, వెంట్రావు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రాయవరం: విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రామచంద్రపురం డీవైఈవో షాలెంరాజు సూచించారు. మండలంలోని పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారో తెలుసుకున్నారు. వారికి పరీక్షలు ఎలా రాయాలో పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై హెచ్ఎం ఎం.అంబేడ్కర్‌ను అడిగి తెలుసుకున్నారు.

వీఆర్ఓ కుటుంబానికి పరామర్శ

కె.గంగవరం: పాణింగపల్లి వీఆర్ఓ బాబూరావు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ వీఆర్ఓ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ తరుపు నుంచి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సర్పంచ్ చీకట్ల సునీత, వైస్ ఎంపీపీ మదుబాల, మార్కెట్ కమిటి చైర్మన్ గోవిందరాజు, గ్రామ పెద్దలు గోపాలం, వెంకట్రావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

లీలావతికి చైర్‌పర్సన్ పరామర్శ

మండపేట: పతి వియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న 2వ వార్డు సచివాలయం కన్వీనర్ జె.లీలావతిని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పరామర్శించారు. ఆమెకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. కౌన్సిలర్ చిట్టూరి సతీష్, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు నాగులపల్లి ఈశ్వరరావు, చంద్రమల్ల లాజరు తదితరులు పరామర్శించారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

రామచంద్రపురం రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రామచంద్రపురం మండలం 2021-22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి ఈ నెల 29న బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్.కీర్తి స్పందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఘనంగా శాంతి హోమం

రాయవరం: స్థానిక పార్వతి సమేత రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు శ్రీరుద్రసహిత చండీ యాగాన్ని నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని శాంతి కల్యాణం చేపట్టారు. ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మల బ్రహ్మత్వంలో రెడ్డి సీతారామశర్మ(రామబుజ్జి) ఆధ్వర్యంలో శాంతి కల్యాణం, మహా పూర్ణాహుతి చేపట్టారు. లోక కల్యాణం కోసం ఈ యాగాన్ని చేపట్టినట్లు ఫణిధర్‌శర్మ తెలిపారు.

ఉత్సాహంగా కార్పెంటర్స్ డే



కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో భీమేశ్వర కార్పెంటర్ యూనియన్, రామచంద్రపురం పట్టణానికి చెందిన కామాక్షి దుర్గ కార్పెంటర్ యూనియన్ల ఆధ్వర్యంలో కార్పెంటర్ డేను ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ద్రాక్షారామ యూనియన్ అధ్యక్షుడు గాలి శ్రీరాము మాట్లాడుతూ సమస్యలు ఎదురైనప్పుడు యూనియన్ ఐకమత్యంతో ఎదుర్కోవాలన్నారు. యూనియన్ ఐకమత్యం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం యూనియన్ కమిటీ హాలు వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు గానాల సత్యసాయి, తరిణి సాంబమూర్తి, వాసంశెట్టి రామ్‌ప్రసాద్, చొల్లంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు తాళ్లరేవు మండలం సుంకరపాలానికి చెందిన దుర్గప్ప వెంకటేశ్వర్లు స్మారకార్థం అతని సతీమణి దుర్గప్ప వీరభద్రం వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.10,116 విరాళం అందించారు. ఏటా మాఘమాసం బహుళ ఏకాదశి రోజున అన్నదానం జరిపించాలని కోరుతూ ఈ విరాళాన్ని ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టీ గూటం శ్రీనుకు అందించారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరి ఎంపిక

పెదపూడి: సంపర గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు తెలిపారు. పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి గత ఫిబ్రవరిలో జరిగిన ఈ అర్హత పరీక్షలో తమ విద్యార్థులు బి.దీపిక పీవీఎస్ఎల్ తేజశ్రీ ఎంపికయ్యారన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది అభినందించారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీరామవర్మ, శేషారావు తదితరులు

మండపేట: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం కృషి చేస్తోందని ద్వారపూడి సొసైటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం సొసైటీ మహాజన సభ జరిగింది. పలు అంశాలపై చర్చించి రైతులు తీర్మానాలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1.92 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్‌కు రైతులు ఆమోదం తెలిపారు. పంట రుణాలపై ప్రభుత్వం ఇచ్చే 3 శాతం వడ్డీ రాయితీగా సొసైటీ పరిధిలోని సుమారు 670 మంది రైతుల ఖాతాలకు రూ.24.5 లక్షలు జమ చేసినట్టు సొసైటీ చైర్మన్ వర్మ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో హమాలీ, రవాణ చార్జీలను నేరుగా తమ ఖాతాలకు జమ చేయాలని రైతులు కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వర్మ తెలిపారు. ప్రజాప్రయోజనాలు, గ్రామ ఉప సర్పంచ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు తులా శేషారావు రైతుల ప్రయోజనాల కోసం పలు ప్రతిపాదనలు చేశారు. సొసైటీ ఆర్థిక పరిపుష్టి కోసం సొసైటీ భవనం పై అంతస్తులోని మీటింగ్ హాల్‌ను చిన్న చిన్న ఫంక్షన్లకు అద్దెకు ఇచ్చేందుకు సమావేశం తీర్మానించింది. అందుకోసం అద్దె కింద రూ.5వేలు, క్లీనింగ్ చార్జీలు కింద రూ.2వేలు వసూలు చేయాలని నిర్ణయించారు. సొసైటీ ప్రగతిని సీఈఓ తోట వెంకటరామయ్య సభ్యులకు వివరించారు. పర్సన్లు కత్తి వీరయమ్మ, మాదిబోయిన రమణ, రైతులు సంగిశెట్టి రమేష్, పోలినాటి సత్యనారాయణ, నందూరి వెంకట, గాదంశెట్టి శ్రీరామ చంద్రమూర్తి తదితర రైతులు పాల్గొన్నారు.

కళా వేదిక నిర్మాణానికి భూమిపూజ

రాయవరం: స్థానిక రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం కళావేదిక నిర్మాణ పనులకు ఎంపీపీ నౌడు వెంకటరమణ భూమిపూజ చేశారు. స్వర్గీయ కొవ్వూరి వెంకటరాయులురెడ్డి(గొల్లారెడ్డి) జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు తేతల సుజాత, మల్లిడి సుధామణి, గొలుగూరి సుశీల, బంధుమిత్రులు రూ.18లక్షల విరాళంగా అందజేయనున్నారు. విద్యార్థులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఓపెన్ ఆడిటోరియం ఎంతగానో ఉపయోగడుతుందని హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిర్మాణ పనులకు ఎంపీపీ వెంకటరమణ భూమిపూజ చేసి, దాతల ఔదార్యాన్ని ప్రశంసించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నల్లమిల్లి నరేంద్రరెడ్డి, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కమలారెడ్డి, శ్రీను, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

శాశ్వత భూరక్ష పథకంతో రైతులకు మేలు



భూరక్ష పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందరాజు తదితరులు

కె.గంగవరం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. శివల గ్రామంలో సోమవారం భూ యజమానులకు జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ అనుసూరి సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా వైఎస్సార్ సీపీ సంస్కరణలు చేపడుతుందన్నారు. గతంలో గ్రామీణ ప్రాంత రైతులు తమ భూములను సర్వే చేయించుకోవాలంటే ఎంతో సమయం వెచ్చించడంతో పాటు నిబంధనలు పాటించాలని కానీ ఈ పథకం ద్వారా గ్రామంలోని ప్రతి సర్వే నంబర్‌ను ఆధునిక సాంకేతికతతో సర్వే చేయించి ఆ వివరాలను పత్రాల ద్వారా అందిస్తున్నారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్లా సూర్యనారాయణ, ఉప సర్పంచ్ నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి పాల్గొన్నారు.